

# ఊరెళ్తున్నారా.. జాగ్రత్త సుమా..! 2



# మత్తు మందు ఇచ్చి దోపిడీ.. 2

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in



## ఎస్సారెస్పీని సందర్శించిన ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ భవ్యశ్రీ

**అక్షరటుడే,మెండోరా:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టును ఆర్మూర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి భవ్యశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ స్థితిగతులను పరిశీలించారు. జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి విధానంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.





ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు.. ఆకాశంలో పతంగుల జోరు.. ఇంటింటా పిండివంటల ఘుమఘుమలు.. సంబురాల సంక్రాంతిని ప్రజలు ఘనంగా జరుపుకోనున్నారు. ఉమ్మడి జిల్లాలో పండుగ కోలాహలం ప్రారంభమైంది. బుధవారం భోగి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం సంక్రాంతి వేడుకలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నగరంతో పాటు పట్టణాల్లో నివసిస్తున్న వారు పండుగ కోసం ఇప్పటికే గ్రామాలకు చేరుకున్నారు. దీంతో పల్లెల్లో సందడి మొదలైంది.

- అక్షరటుడే, ఇందూరు



# సంబురాల సంక్రాంతి

- పల్లెలకు చేరిన ప్రజలు
- కుటుంబాల్లో సందడి
- పిండి వంటల ఘుమఘుమలు
- ఘనంగా భోగి వేడుకలు

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడాన్ని పుణ్యకాలంగా భావిస్తారు. అది భోగి రోజు జరుగుతుంది. భోగి సందర్భంగా చిన్నారులకు రేగు పండ్లు, చెరుకు గడలు, చిల్లర నాణాలు, అక్షింతలు కలిపి తల మీద పోసే ఆచారం అనాదిగా వస్తుంది. పలుచోట్ల భోగి మంటలతో పాటు భోగి పండ్ల వేడుక ఉత్సాహంగా నిర్వహించారు. రెండో రోజు సంక్రాంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా వాసుల సిద్ధమయ్యారు. నోరూరించే సంక్రాంతి పిండి వంటకాల తయారీలో ఇంటిల్లిపాది నిమగ్నమయ్యారు.

### మహిళల నోములు

తెలంగాణలో సంక్రాంతి వచ్చిందంటే మహిళలకు పెద్ద పండుగే. చిన్న నుంచి పెద్దల వరకు సౌభాగ్యంగా ఉండాలని ఆయా రకాల నోముల ను వాయినాలుగా ఇస్తారు. ఒకరికొకరు 13 నోములను అందజేస్తారు. ఇప్పటికే మార్కెట్లోని దుకాణాలు కొనుగోళ్లతో సందడిగా మారాయి. ఇక చిన్న పెద్ద తేడా లేకుండా పతంగుల జోరు ఊపందుకుంది. ఇంటి బంగ్లాలపై డీజే సౌండ్ల తో.. ఆకాశం పతంగులతో నిండిపోయింది. జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ప్రాంగణం పతంగుల దుకాణాలతో కోలాహలంగా మారాయి. ఇక మూడో రోజు కనుమను పురస్కరించుకొని మాంసాహార వంటకాలకు సిద్ధమయ్యారు.



కామారెడ్డిలో సంక్రాంతి సంబురాలు..



పతంగిని ఎగురవేస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర



బీర్కూర్ మండలంలోని రైతునగర్‌లో భోగి మంటలు..





## పతంగులంటే చిన్నాపెద్దా అందరికీ పండుగే..: ఎమ్మెల్యే పోచారం

**అక్షరటుడే, బాన్సువాడ :** పతంగుల పండుగను చిన్న పిల్లలతో పాటు పెద్దలు కూడా ఉత్సాహంగా జరుపుకుంటారని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా బాన్సువాడ పట్టణంలోని వీక్లీ మార్కెట్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. కైట్ ఫెస్టివల్‌లో భాగంగా పట్టణవాసులు, చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే పోచారం పతంగులు ఎగురవేశారు. అనంతరం బాన్సువాడ నుంచి పండరీపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్న భక్తుల బృందానికి పాత బాన్సువాడ హనుమాన్ మందిరం వద్ద జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ జంగం గంగాధర్, భవాని ప్రసాద్, నార్ల సురేష్, కృష్ణారెడ్డి, ఎజాజ్, గోపాల్ రెడ్డి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



## నిజామాబాద్ అర్బన్‌లో పోలింగ్‌స్టేషన్ల పెంపు

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ అర్బన్‌లో ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్లను పెంచినట్లు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం.. పోలింగ్‌స్టేషన్ల సంఖ్యను పెంచినట్లు తెలిపారు. ప్రతి బూత్‌లో 750 నుంచి 770 వరకు ఓటర్లు ఉండేలా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే కేంద్రాలను పెంచినట్లు చెప్పారు. సమావేశంలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, తుది నివేదికను త్వరలో విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీంద్ర సాగర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.




## హిందూ సమాజంలో అంటరానితనం లేదు

**అక్షరటుడే, ఇందూరు:** హిందూ సమాజంలో అంటరానితనం లేదని.. రాముడు శబరి ఎంగిలి తినడం.. అరుంధతి నక్షత్రాన్ని చూడడం సమరసత జీవనానికి దర్పణమని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన వక్త రాజుల్‌వార్ దిగంబర్ తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ శ్రీరామ్ ఉపనగరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జనార్దన్ గార్డెన్‌లో సంక్రాంతి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచ పరివర్తన ద్వారా సమాజ పరివర్తన కోసం పాటుపడాలని రాజుల్‌వార్ దిగంబర్ సూచించారు. హిందువు హిందువుగా జీవించాలని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టి దేశ సమైక్యత కోసం నిర్విరామ కృషి చేస్తుందన్నారు. శతాబ్ది వేడుకల్లో భాగంగా సంక్రాంతి పండుగ విశిష్టతను సందేశాన్ని ప్రతి హిందువు కుటుంబానికి అందజేయాలను కోరారు. కార్యక్రమంలో నగర కార్యవాహ అరుగుల సత్యం, సహకార్యవాహ సుమిత్, అనిల్, అభిరామ్, శ్రవణ్, మృత్యుంజయ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందూరు తిరుమలలో కనుల పండువగా 'గోదా రంగనాథ' కల్యాణం

**అక్షరటుడే, ఇందూరు :** నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో గోదా రంగనాథ కల్యాణం కనుల పండువగా జరిగింది. అమ్మ వారి కల్యాణ వేడుకల్లో దిల్ రాజు దంపతులు పాల్గొన్నారు. నేడు గోదా కల్యాణంతో పరమ పవిత్రమైన ధనుర్మాసం ముగుస్తుందని ఆచార్యులు సంపత్ కుమారాచార్య తెలిపారు. గోదాదేవి ఎంతో నిష్టతో 'శ్రీ వ్రతం' చేసి రంగనాథుడిని కల్యాణమాడి వారిలో లీనమైందని అన్నారు. ధనుర్మాసంలో 'తిరుప్పావై' పఠనం మనకు వైకుంఠనాథుడిని హృదయానికి చేరువ చేస్తుందన్నారు. గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్దఎత్తున పాల్గొనడంతో ఆలయం కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీరోహిత్ కుమారాచార్య, విజయ్ స్వామి, ఆలయ ధర్మకర్తలు దిల్ రాజు దంపతులు, నర్సింహారెడ్డి దంపతులు, నర్సారెడ్డి, రమేష్, నరాల సుధాకర్ దంపతులు, ప్రసాద్ భాస్కర్, మురళి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## 600 వీధి కుక్కల హతం.. ఐదుగురు సర్పంచులపై కేసు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో 600 వీధి కుక్కలు హతమైన ఘటన కలకలం రేపింది. కుక్కలను చంపి పాతి పెట్టారంటూ ఐదుగురు సర్పంచులపై జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో వీరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలంలోని భవానిపేట, పాల్వంచ, ఫరీదుపేట, వాడి, బందరామేశ్వర్ పల్లి గ్రామాల్లో 600 వీధి కుక్కలకు ఇంజక్షన్లు, విష గుళికలు ఇచ్చి చంపి పాతి పెట్టారని కరీంనగర్ జిల్లా మల్కాపూర్‌కు చెందిన ఓ జంతు ప్రేమికుడితో పాటు మరికొందరు ఎన్జీవోస్ ఈ నెల 12న మాచారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ ఎన్నికలలో వాగ్ధానాలను అమలు చేయడానికి సర్పంచులు వీధి కుక్కలను చంపేశారని ఆరోపించారు. దీంతో చంపేసి పూడ్చివేసిన వీధి కుక్కల మృతదేహాలను జేసీబీ సహాయంతో వెలికితీసి వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసుల విచారణ అనంతరం ఐదుగురు సర్పంచులపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రజల సౌకర్యార్థం, హాని కలగకుండా ఉండేందుకు చేసిన పని ఇప్పుడు సర్పంచుల మెడకు చుట్టుకుందన్న వాదన వినిపిస్తోంది. ఐదుగురు సర్పంచులపై కేసు నమోదు కావడంతో మిగతా సర్పంచుల్లో ఆందోళన మొదలైందన్న టాక్ వినిపిస్తోంది.




## ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నా: ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నియోజకవర్గాన్ని ఇచ్చిన మాట ప్రకారం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఎల్లారెడ్డి మండలంలో రూ. 30 కోట్ల పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో రూ.14 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.2 కోట్ల నిధులతో ఎల్లారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని విలీన గ్రామాల్లో, రూ.4 కోట్ల నిధులతో పురపాలక సంఘం పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.5 కోట్ల నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు, రూ. 3 కోట్ల నిధులతో పెద్ద చెరువు వద్ద మల్టీ జనరేషన్ పార్క్ నిర్మాణ పనులకు, రూ.2 కోట్ల నిధులతో వ్యవసాయ మార్కెట్ నూతన భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు. మరుగుదొడ్లు, ప్రహరీ, వాణిజ్య సముదాయ నిర్మాణానికి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజిత వెంకటరామిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే మున్నూరు కాపు సంఘానికి రూ.5 లక్షలు, ముదిరాజ్ సంఘం అభివృద్ధికి రూ. 5 లక్షల మంజూరు కాపీలను ఎమ్మెల్యే అందజేశారు. ఎస్సీ వాడలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. లింగారెడ్డిపేట ప్రాథమిక పాఠశాల ఏర్పాటు కోసం ప్రభుత్వం జీవో జారీ చేసిందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం చేయలేని అనేక అభివృద్ధి పనులను, తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అమలు చేస్తున్నానని ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పర్చడంలో రాజీలేకుండా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి వార్డు, ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే తన ధ్యేయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్లు పద్మ శ్రీకాంత్, కుడుముల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ గౌడ్, వినోద్ గౌడ్, వెంకటరామిరెడ్డి అధికారులు పాల్గొన్నారు.



## గోదాదేవి కల్యాణ మహోత్సవం



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు సంజీవ్ రెడ్డి, శ్యాంసుందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, నాయకులు పండిత్ పవన్, భూపేందర్, శ్రావణ్, రాజు భాయ్, జిమ్మి రవి, శ్రీకాంత్, ప్రమోద్ పాల్గొన్నారు.



## బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లో..

**అక్షరటుడే, బాల్కొండ:** జలాల్‌పూర్ గ్రామంలో గోదాదేవి, రంగనాథ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, భూగర్భ జలాల గనుల శాఖ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై శైలేందర్, బాల్కొండ తహశీల్దార్ శ్రీనివాస్ హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండేటి మోహన్ రెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ నర్సారెడ్డి, వైస్ ఛైర్మన్ ఎంబరి ఆనంద్, ఉపసర్పంచ్ మూగ భోజన్న, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, జలాల్‌పూర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగకు ఉద్యోగులు, విద్యార్థులకు సెలవులు వచ్చాయి. ఈ క్రమంలో ప్రజలు తమ సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్లకు తాళం వేసి వెళ్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ఊరెళ్లే ముందు సమాచారం ఇవ్వాలని సూచించారు.

– అక్షరటుడే, కామారెడ్డి

# ఊరెళ్తున్నారా.. జాగ్రత్త సుమా..!



■ పండుగకు ఊరెళ్లి వచ్చేలోపు ఇల్లు గుల్లయ్యే అవకాశం ■ వరుస చోరీలతో పోలీసుశాఖ అప్రమత్తం

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పలువురు ఉద్యోగులు, సాధారణ ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళ్తున్నారు. పలువురు ఇళ్లలోనే విలువైన వస్తువులు బీరువాలోనో, ఇతర చోట భద్రంగా దాచుకుని ఇంటికి తాళం వేసి వెళ్తున్నారు. ఈ క్రమంలో తాళాలు వేసిన ఇళ్లనే దోపిడీ దొంగలు టార్గెట్ చేస్తున్నారు. దాంతో జిల్లా పోలీస్‌శాఖ ప్రజలను అప్రమత్తం చేస్తోంది.

### వరుస చోరీలతో గుబులు..

కామారెడ్డి పట్టణంతో పాటు జిల్లాలో పలుచోట్ల ఇటీవల చోరీలు వెలుగు చూస్తున్నాయి. తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా పట్టపగలు కూడా చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఊళ్లకు వెళ్తున్న ప్రజలు విలువైన వస్తువులను ఇంట్లో ఉంచవద్దని పోలీసులు సూచిస్తున్నారు. గ్రామాలకు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

### పోలీసుల సూచనలివే..

జిల్లాలో జరుగుతున్న చోరీల పట్ల పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో ప్రజలకు జాగ్రత్తలు చెబుతున్నారు. ఇంటికి తాళం వేసి వెళ్తుంటే బయటకు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. తద్వారా చోరీలకు ఆస్కారం ఉండదని పేర్కొంటున్నారు.

### ముందస్తు సమాచారం ఇస్తే సరి..

ఎవరైనా ఊరెళ్లే పరిస్థితుల్లో తప్పనిసరిగా పక్కింటివారికి సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు. అప్పుడప్పుడు చూస్తూ ఉండాలని.. ఎలాంటి అలికిడి అయినా వెంటనే తమకు గాని, పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలని వారికి సూచించాలన్నారు. అలాగే పోలీసులకు సైతం సమాచారం అందిస్తే ప్రత్యేక నిఘా పెట్టే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

### పోలీసుల సూచనలు పాటించాలి



సంక్రాంతి పండుగకు ప్రజలు సొంత గ్రామాలకు వెళ్లేటప్పుడు ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఇళ్లకు తాళం వేసి వెళ్తున్న సమయంలో పోలీసుల సూచనలను పాటించాలి. తాళం వేసి వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇంటి ప్రధాన ద్వారానికి బలమైన తాళం వేయాలి. ఇంటిముందు లైట్ వేసి ఉంచాలి.

– రాజేష్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి



## అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థికసాయం

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త గడ్డం విఠల్ తల్లి రుక్కవ్వ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు గార్గె శ్రీనివాస్ తనవంతుగా మృతురాలి కుటుంబానికి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ధైర్యం కలగాలని వారు ప్రార్థించారు. కార్యక్రమంలో బీజేపీ నస్రుల్లాబాద్ మండలాధ్యక్షుడు చందూరి హన్మాండ్లు, నెమలి సర్పంచ్ రాంగోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ బండి సాయిలు, చందూరు సాయిలు, బండి లక్ష్మణ్ నారాయణ, సుక్కన్న పాల్గొన్నారు.



## ఐదో డివిజన్‌లో గాలిపటాల అందజేత

**అక్షరటుడే, ఇందూరు:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఐదో డివిజన్‌లో కాలనీవాసులకు బీజేపీ నాయకుడు యాదాల నరేశ్ పతంగులు పంపిణీ చేశారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా ఎల్లప్పుడు తాను అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



## జేసీఐ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

**అక్షరటుడే, ఇందూరు :** జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఇందూర్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ఇంద్రాపూర్ కాలనీలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కాలనీకి చెందిన పిల్లలకు గాలిపటాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఐ ఇందూర్ అధ్యక్ష కార్యదర్శులు జైపాల్ కాలె, తిరునగరి మనస్విని, జోన్ ఆఫీసర్ జిల్కర్ నయన్, ప్రోగ్రామ్ ఛైర్మన్ కోడూరు శ్రీనివాస్, జేసీసీ అలుమ్నిక్లబ్ రీజియన్ ఛైర్మన్ జిల్కర్ లావణ్య, పూర్వాధ్యక్షుడు చింతల గంగాదాస్, తిరునగరి శ్రీహరి, జేసీఐ ప్రతినిధులు నిపుణ్, సునీత, వెన్నెల, మృణాళిని, అక్షిత, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బాక్సింగ్ కోచ్ సంజీవ్‌కు 'నేషనల్ ప్రీమియర్' అవార్డు

**అక్షరటుడే, భీమ్‌గల్ :** మండల కేంద్రానికి చెందిన యువరైతు, బాక్సింగ్ అకాడమీ కోచ్ కనూర్ సంజీవ్‌ను ప్రతిష్టాత్మక 'అలోక్ నేషనల్ ప్రీమియర్ అవార్డు' వరించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఒక తెలుగు లఘు చిత్రంలో కనబర్చిన అద్భుత నటనకు గాను ఆయనకు 'ఉత్తమ నటుడు' పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం అకాడమీలో ఆయనను ఘనంగా సన్మానించారు. అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ రామావత్ మాట్లాడుతూ.. సంజీవ్ బాక్సింగ్‌లోనే కాకుండా అంకిత భావం గల కార్యకర్తగా, రైతుగా, నటుడిగా రాణిస్తూ బహుముఖ ప్రజ్ఞను చాటుకోవడం గర్వకారణమన్నారు. క్రీడలతో పాటు కళారంగంలోనూ ప్రతిభ చాటుతూ యువతకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో అకాడమీ సభ్యులు, క్రీడాకారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



## ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



**అక్షరటుడే,కోటగిరి:** పోతంగల్ మండలం హంగర్గ (బీసీ కాలనీ గుట్ట)లోని హనుమాన్ మందిరం వద్ద సంక్రాంతి సందర్భంగా సర్పంచ్ ఉదయ్ భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో దాదాపు 42 మంది మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలకు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్ చేతుల మీదగా సంధ్యారాణికి ప్రథమ బహుమతి, మౌనికకు ద్వితీయ బహుతులను అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ హంగర్గ గంగాధర్, సుభాష్, శాంతేశ్వర్, జీవన్, రాజు, బజరంగ్, ఈశ్వర్, షఫీ, సురేష్, శివాజీ, మహిళలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



## ముప్కాల్‌లో పతంగుల దుకాణాల తనిఖీ

**అక్షరటుడే, ముప్కాల్:** భోగి, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ఎస్సై కిరణ్ పాల్ బుధవారం మండలంలోని వివిధ వ్యాపార దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎవరైనా చైనా మాంజా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గాలిపటాలు ఎగురేసే సమయంలో చైనామంజా వాడకం ప్రమాదకరమన్నారు. దుకాణా దారులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చైనా మాంజాను విక్రయించినా లేదా వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## భీమ్‌గల్‌లో అయ్యప్ప స్వామి వార్షికోత్సవం

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండల కేంద్రంలోని చొక్కయ్య గుట్టపై వెలిసిన అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం 14వ వార్షిక మకర సంక్రాంతి వేడుకలను నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణలు జరపనున్నట్లు వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశామని, పట్టణంతో పాటు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. మకర జ్యోతి దర్శన వేళ ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కల్లెడి గ్రామంలో 12 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు చెక్కులు అందజేశామన్నారు. కల్లడి గ్రామంలో ప్రజలు ఎవరైనా అనారోగ్య రీత్యా ఆస్పత్రిలో చికిత్స అనంతరం తమను సంప్రదిస్తే సీఎంఆర్ఎఫ్ ద్వారా వారికి ఆర్థికసాయం అందజేస్తామన్నారు. అలాగే వైద్యసాయం నిమిత్తం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఎల్‌వోసీ ఇప్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇస్సపల్లి రాజు, వార్డు సభ్యులు గంగూలీ, బూత్ అధ్యక్షుడు మచ్చర్ల అర్జిత్, అయిలి అరుణ్, నరేందర్, సిరికొండ సాయికుమార్, నర్సింగ్, గంగాధర్, ప్రతాప్, సాయిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్ వ్యాపారం పేరుతో మత్తు మందు ఇచ్చి దోపిడీ..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** రైస్‌మిల్ వ్యాపారం చేస్తే తక్కువ కాలంలోనే ఎక్కువ లాభం వస్తుందని నమ్మించి ఓ వ్యక్తిని నిలువు దోపిడీ చేసిన ముఠాను నాలుగో టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలను ఎస్‌హెచ్‌వో సతీష్ కుమార్ వెల్లడించారు. నగరానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తికి ఇటీవల ముగ్గురు వ్యక్తులు పరిచయమయ్యారు. రైస్‌మిల్ వ్యాపారం చేస్తే తక్కువ సమయంలోనే అధిక లాభాలు గడించవచ్చని నమ్మించారు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు కలిసి నగరంలోని ఓ ఇంటర్నేషనల్ హోటల్‌లో దావత్ పేరుతో బీరులో మత్తుమందు కలిపి శ్రీనివాస్‌తో తాగించారు. అనంతరం అతడు అపస్మారక స్థితికి చేరుకోగానే రెండు బంగారు ఉంగరాలు, గోల్డ్ చైన్, కొంత నగదు దోచుకుని పారిపోయారు. అనంతరం తేరుకున్న శ్రీనివాస్ తాను మోసపోయానని గుర్తించి నాలుగో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు బాత ప్రసాదం, నర్సింగరావు, రుద్రా యాదవ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. చోరీ చేసిన బంగారాన్ని హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి వద్ద తాకట్టు పెట్టారని పోలీసులు తెలిపారు. అనంతరం ఈ ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సైలు ఉదయ్‌కుమార్, సందీప్‌కుమార్ పాల్గొన్నారు. కేసు ఛేదించిన ఏఎస్సై రవీందర్, కానిస్టేబుళ్లు శేఖర్, రమేష్, నగేష్, సిబ్బందిని సీఐ అభినందించారు.

## బాన్సువాడ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహా కల్యాణ మండపంలో నిర్వహించిన (రెడ్డి సంఘం) సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా పాశం భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎరువుల సంతోష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొర్ల నరేష్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా నందిగం కృష్ణారెడ్డి, కోశాధికారిగా మాసాని లక్ష్మీకాంత్ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## చైనామాంజా విక్రయిస్తున్న ఒకరి అరెస్టు.. మరొకరు పరారీ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** చైనా మాంజా విక్రయిస్తున్న ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వెల్లడించారు. నగరంలో పలు పతంగుల దుకాణాల్లో చైనామాంజా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి దాడులు చేశారు. పోస్టాఫీస్ వెనక ప్రాంతంలో సుల్తాన్ కైట్ షాప్ వద్ద సయ్యద్ అస్లామ్ అనే వ్యక్తి చైనామాంజా అమ్ముతుండగా పట్టుకున్నారు. తన బైక్‌లో తీసుకెళ్తున్న 18 చైనామంజా చర్కాలను స్వాధీనం చేసుకున్నారు. అతడి యజమాని ఫయీం అన్సారీ పరారయ్యాడు. వీరిద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. మనుషులు, పక్షులకు ప్రాణాంతకంగా మారిన చైనామాంజాను ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్ సాయికిరణ్, నవీన్, భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

## పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

**అక్షరటుడే,కోటగిరి:** పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశారు. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతంగల్ మండలం కల్లూరు గ్రామ శివారులో పక్కా సమాచారం మేరకు మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.7,920 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.